సమస్యల పరిష్కారానికి కృషి

- బజార్‌హత్నూర్ మండల సమావేశంలో బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్

బజార్‌హత్నూర్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే జాదవ్ అనిల్

బజార్‌హత్నూర్, డిసెంబర్ 29 : మండలంలోని సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అజిడే జయశ్రీ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఆయన హాజరయ్యారు. మండలంలో విద్య, వైద్యం, రోడ్లు ప్రధాన సమస్యలుగా ఉన్నాయని స్థానిక ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. పనులు ప్రారంభించి పెండింగ్ లేకుండా పూర్తి చేయాడానికి కృషి చేస్తానని తెలిపారు. అంతకుముందు ఆయా శాఖల అధికారులు తమ ప్రగతినివేదికలను చదవి వినిపించారు. తొలిసారిగా మండలానికి విచ్చేసిన ఎమ్మెల్యేను ప్రజాప్రతినిధులు, అధికారులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ నర్సయ్య, బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ రుక్మాణ్‌సింగ్, ఎంపీడీవో రాధ, ఆయా శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

విధులు సక్రమంగా నిర్వహించని అధికారులను సరెండర్ చేయండి

గుడిహత్నూర్, డిసెంబర్ 29 : విధులు సక్రమంగా నిర్వహించని అధికారులను సరెండర్ చేయాలని సభ్యులు తీర్మానం చేశారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నాగర్‌గోజే భరత్ అధ్యక్ష తన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈజీఎస్ ఏపీవో సుభాషిణిరెడ్డి విధుల్లో నిర్లక్ష్యం చేస్తోందని, పనులు సక్రమంగా నిర్వహించడం లేదని ఆమెను సరెండర్ చేయాలని సభ్యులు శగీర్‌ఖాన్, కేంద్రె న్యాను సభ దృష్టికి తీసుకువచ్చారు. ఐకేపీ ఏపీఎం నీలారాణి డ్వాక్రా గ్రూపు సభ్యులకు రుణాలు ఇప్పించడం, తీసుకున్న డబ్బుల రికవరీ చేయించడంలో ఆమె పట్టించుకోవడం లేదని, ఆఫీసుకు ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు వెళ్తుందో తెలియడం లేదని ఇలాంటి అధికారులు అవసరమా అని సభ్యులు న్యాను, శగీర్ ఖాన్,సర్పంచ్ తిరుమల్‌గౌడ్ ప్రశ్నించారు. మండల వైద్యాధికారి శ్యాంసుందర్ మాట్లాడుతూ కరోనా విషయంలో జాగ్రత్తగా ఉండాలని, మాస్కు, మల్టి విటమిన్ మందులు వాడాలని అందుబాటులో పీహెచ్‌సీలో ఉన్నాయన్నారు. ప్రజలకు అవగాహన కల్పించాలని సభ్యులను కోరారు. వివిధ శాఖ అధికారులు ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. సమావేశంలో జడ్పీటీసీ బ్రహ్మానంద్, ఎంఈవో నారాయణ, మండల వ్యవసాయాధికారి రేవతి, ఎంపీడీవో అరుణ, సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

గుడిహత్నూర్: సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ, జడ్పీటీసీ

రామయ్య అక్షింతల ఊరేగింపు

ఉట్నూర్, డిసెంబర్ 29 : అయోధ్య రామయ్య అక్షింతలు శుక్రవారం ఉట్నూర్‌కు చేరుకున్నాయి. ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ, ఉట్నూర్ హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో అక్షింతలను వినాయక్ చౌక్ నుంచి ప్రధాన చౌరస్తాల మీదుగా శ్రీసాయిగురుదత్త మందిరం వరకు శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

ఇచ్చోడ, డిసెంబర్ 29: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల శుభ్రత పాటించాలని డాక్టర్ బీ నరేశ్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని జడ్పీఎస్ఎస్ పాఠశాలలో ఆర్ బీఎస్‌కే వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం సురేశ్‌జోషి, రమణారెడ్డి పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

బోథ్, డిసెంబర్ 29: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ పంద్రం సుగుణ అన్నారు. శుక్రవారం మండలంలోని పట్నాపూర్ గ్రామంలో ప్రచార రథం ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ అధికారి రవికుమార్, నరేశ్, డాక్టర్ ప్రియాంక, కార్యదర్శి మిథున్, ఏఎన్ఎం కవిత, అంగన్‌వాడీ టీచర్ సుశీల, శోభ, శ్రీనివాస్, బీపీఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొనసాగతున్న సికెల్‌సెల్ పరీక్షలు

ఉట్నూర్ రూరల్, డిసెంబర్ 29: మండలంలోని కుమ్మరికుంట, దొంగచింత గ్రామాల్లో వైద్య సిబ్బంది సికెల్‌సెల్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. కుమ్మరికుంటలో 32 మందికి వైద్య పరీక్షలు చేయగా నలుగురికి వ్యాధి నిర్ధారణ అయింది. దొంగచింతలో 71 మందికి వైద్య పరీక్షలు చేయగా రాజుగూడకు చెందిన ఇద్దరికి వ్యాధి నిర్ధారణ అయినట్లు వైద్యురాలు అనురాధ పేర్కొన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నూర్‌సింగ్, సర్పంచ్ జుగాదిరావ్, పటేల్ భీంరావ్, డాక్టర్ ప్రవీణ్ పాల్గొన్నారు.

టీఎస్ యూటీఎఫ్ మండల కార్యవర్గం

బజార్‌హత్నూర్, డిసెంబర్ 29: టీఎస్ యూటీఎఫ్ మండల కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షుడు స్వామి అధ్యక్షతన శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా భగత్ బాపురావ్, ప్రధాన కార్యదర్శిగా రాజేందర్, ఉపాధ్యక్షులుగా జ్ఞానేశ్వర్, లక్ష్మి, కోశాధికారిగా మనోజ్, కార్యదర్శులుగా అశ్రఫ్, సోనేరావ్, సుకుమార్, గంగామణిలను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నార్నూర్, డిసెంబర్ 29 : మండలంలోని బాబేఝరి గ్రామ పంచాయతీ పరిధిలోని దన్నుగూడ గ్రామానికి చెందిన పెందూర్ కైలాస్(18) అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులను శుక్రవారం ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా సంఘం డివిజన్ అధ్యక్షుడు కనక ప్రభాకర్ మాట్లాడుతూ దన్నుగూడ గ్రామానికి వెళ్లాలంటే రోడ్డు సౌకర్యంతో పాటు వంతెన లేకపోవడంతో అ గ్రామంలో నివాసముంటున్న ఆదివాసీలకు అత్యవసర సమయంలో సకాలంలో వైద్యం అందక ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ప్రభుత్వం ఈ గ్రామానికి రోడ్డు, వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఇక్కడ నాయకులు రాయిసిడాం ఏత్మారావ్, మడావి ఆనంద్‌రావ్, మెస్రం ఆనంద్‌రావ్ ఉన్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

ఎదులాపురం, డిసెంబర్ 29 : ఆదిలాబాద్ జిల్లా కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సీహెచ్ వీఆర్ఆర్ వరప్రసాద్ సూచించారు. శుక్రవారం కోర్టు సమావేశ మందిరంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్ అదాలతో పరిష్కారమైన కేసులకు అప్పీల్ చేసే అవకాశముండదన్నారు. బ్యాంకు, ఇన్సూరెన్స్, సివిల్, కొన్ని క్రిమినల్ కేసులు పరిష్కారం చేసుకోవచ్చన్నారు. సమావేశంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి క్షమాదేశ్‌పాండే, తదితరులు పాల్గొన్నారు.

1న భీమా కోరేగావ్ శౌర్య దివస్

ఇంద్రవెల్లి: పోస్టర్ విడుదల చేస్తున్న అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ సభ్యులు

ఇంద్రవెల్లి, డిసెంబర్ 29: ఆదిలాబాద్‌లోని అశోక్ బుద్ధ విహార్‌లో అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జనవరి 1వ తేదీన నిర్వహించే భీమా కోరేగావ్ శౌర్య దివస్‌ను విజయవంతం చేయాలని అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు భీంరావ్, ఇంద్రవెల్లి మండల అధ్యక్షుడు సోన్‌కాంబ్లే మనోహర్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ జిల్లా కమిటీ, ఇంద్రవెల్లి మండల కమిటీ నాయకుల ఆధ్వర్యంలో భీమా కోరేగావ్ శౌర్య దివస్ ప్రచార పోస్టర్ విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని అన్ని మండలాలకు చెందిన బహుజనులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ నాయకులు దాదాసాహెబ్, ఉద్దవ్, వాగ్మారే కామ్‌రాజ్, సునీల్, రాజ్‌వర్ధన్, సత్యానంద్, శివాజీ, బాపురావ్, లక్ష్మణ్, ఆనంద్‌రావ్, తదితరులు పాల్గొన్నారు.

ఉట్నూర్, డిసెంబర్ 29: జిల్లా కేంద్రంలోని కైలాస్‌నగర్‌లో జనవరి 1వ తేదీన నిర్వహించే భీమా కోరేగావ్ శౌర్య దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దళిత జేఏసీ నాయకుడు దావుల రమేశ్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో భీమా కోరేగావ్ శౌర్య దివస్‌కు సంబంధించిన పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రజ్ఞాశీల్, కొమ్ము విజయ్, సుభాష్, హకీం, భీంరావ్, సూర్యవంశీ, జాబాడేలు పాల్గొన్నారు.

3న గురకులాల రీజియన్ లెవల్ ఇగ్నైట్ ఫెస్ట్

మాట్లాడుతున్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సమన్వయకర్త గంగాధర్

ఇచ్చోడ, డిసెంబర్ 29: తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకులాల రీజియన్ లెవల్ ఇగ్నైట్ ఫెస్ట్ జనవరి 3, 4వ తేదీల్లో మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ గురకులాల పాఠశాలలో నిర్వహించనున్నట్లు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సమన్వయకర్త గంగాధర్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో ఇగ్నైట్ ఫెస్ట్ నిర్వహణ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఇగ్నైట్ ఫెస్ట్‌ను విజయవంతం చేయాలని కోరారు. ఇగ్నైట్‌లో సైన్స్ ఫెయిర్, మోడల్ యూనైటెడ్ నేషన్స్, యూత్ పార్లమెంట్, గ్రూప్ డ్యాన్స్, సోలో సాంగ్స్, వ్యాసరచన, ఉపన్యాస, స్పెల్‌బీ, షార్ట్ ఫిలిం మేకింగ్, వీడియో రివ్యూ, ఫ్లోర్ ఆర్ట్ మొదలైన అంశాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇవేకాకుండా ఈసారి ఫ్యాషన్ షో, ఫ్యాన్సీ డ్రెస్, స్టోర్ నర్రేషన్ పోటీలు కూడా నిర్వహిస్తారని పేర్కొన్నారు. పోటీలను నిష్పాక్షపాతంగా నిర్వహించి రాష్ట్ర స్థాయిలో గెలిచే సత్తా ఉన్న టీంను తయారు చేయాలని సూచించారు. సమావేశంలో ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, లక్ష్మీకాంతరావ్, రాంమోహన్, కృష్ణవేణి, ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

పతకాలు సాధించిన విద్యార్థులతో ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్

ఉట్నూర్ రూరల్, డిసెంబర్ 29: ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పారా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఉట్నూర్‌కు చెందిన వికాసం విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. విద్యార్థులు, సిబ్బందిని ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ అభినందించారు. డిస్కోత్రోలో మెస్రం రాజు, రన్నింగ్‌లో పెందూర్ అరుణ, లాంగ్ జెంప్‌లో కోట్నాక్ ధనలక్ష్మి బంగారు పతకం, షాట్‌పుట్‌లో గుడిపెల్లి మల్లికార్జున్ వెండి పతకం, రన్నింగ్‌లో నవీన్ కుమార్ బంగారు పతకం, లాంగ్ జంప్‌లో కుమ్ర మహేశ్ రజత పతకం సాధించారు. కార్యక్రమంలో డీడీ దిలీప్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజల పక్షాన ప్రశ్నించే గొంతుగా నిలుస్తాం

- మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్
- కొనసాగిన ప్రజాపాలన గ్రామసభలు

ఆదిలాబాద్‌రూరల్: దరఖాస్తు స్వీకరిస్తున్న మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్

ఆదిలాబాద్ రూరల్, డిసెంబర్ 29 :కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీల సంక్షేమ ఫలాలు అర్హులైన పేదలందరికీ అందడమే లక్ష్యంగా వారి పక్షాన ప్రశ్నించే గొంతుగా నిలుస్తామని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్‌లోని పలు చోట్ల ఏర్పాటు చేసిన ప్రజాపాలన దరఖాస్తుల కేంద్రాలను పరిశీలించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసేలా బీఆర్ఎస్ పార్టీ ప్రజల తరపున ప్రశ్నిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రాంకుమార్, సూర్యభాను, సునీల్, సుదర్శన్ పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

బోథ్, డిసెంబర్ 29 : ఆరు గ్యారెంటీ పథకాల కోసం అర్హులందరూ గ్రామసభల్లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో వెల్మ సుశీల్ రెడ్డి, తహసీల్దార్ సుభాష్‌చందర్, ఎంపీవో జీవన్‌రెడ్డి సూచించారు. మండలంలోని చింతల్‌బోరి, బాబెర, దేవులనాయక్‌తండా, నిగిని, పిప్పల్‌ధరి, పార్డీ(కే) గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భీంపూర్, డిసెంబర్ 29 : గోముత్రి, అంతర్గాం, అందర్‌బంద్, కైరిగూడ గ్రామాల్లో అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కుమ్ర సుధాకర్, ఎంపీపీ రత్నప్రభ , వైస్ఎంపీపీ గడ్డం లస్మన్న, ఎంపీడీవో శ్రీనివాస్, డీటీ హరీశ్, ఎంపీవో వినోద్, హెచ్ఈవో లింగంపల్లి జ్ఞానేశ్వర్, సూపర్‌వైజర్ గంగాధర్, ఏఈవోలు , సర్పంచ్‌లు నిమ్మ వేణుయాదవ్, లలిత, కృష్ణయాదవ్, అనిల్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

ఇంద్రవెల్లి, డిసెంబర్ 29 : ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి రాథోడ్ రవీందర్ అన్నారు. మండలంలోని బిక్కుతండా, మర్కాగూడ, తుమ్మగూడ, మెండపల్లి గ్రామాల్లో ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించారు. ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, ఎంపీడీవో పుష్పలత, ఎంపీవో సంతోష్‌కుమార్, ఏఈవో కరుణ, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, సర్పంచ్‌లు విజయ, భీంరావ్, షేకు పాల్గొన్నారు.

దరఖాస్తులు బయట కొనుగోలు చేయద్దు

తాంసి, డిసెంబర్ 29 : అభయహస్తం గ్యారెంటీలకు సంబంధించి ప్రజలు అందించే దరఖాస్తు పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి తీసుకోవాలని జడ్పీటీసీ తాటిపల్లి రాజు, డీఆర్డీవో కిషన్ అధికారులకు సూచించారు. మండలంలోని సావర్గాం గ్రామంలో దరఖాస్తు పత్రాల స్వీకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ప్రజలకు అవసరమైన మేరకు దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయని, బయట కొనుగోలు చేయవద్దని తెలిపారు. అలాగే గిరిగామ గ్రామంలో ప్రజాపాలన గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో గణపతి, ఎంపీపీ సురకుంటి మంజులాశ్రీధర్ రెడ్డి, ఎంపీడీవో ఆకుల భూమయ్య, తహసీల్దార్ లక్ష్మి, ఈవోపీఆర్డీ సుధీర్ రెడ్డి, సర్పంచ్‌లు మునేశ్వర్ భరత్, గజానంద్, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ ధనుంజయ్, ఉత్తమ్ పాల్గొన్నారు.

ఇచ్చోడ(సిరికొండ), డిసెంబర్ 29 : గ్యారెంటీలకు అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలను ముక్రా(కే) సర్పంచ్ గాడ్గె మీనాక్షి అన్నారు. మండలంలోని ముక్రా(కే), దాబా(బీ), బాజీపేట్, ధరంపూరి గ్రామాల్లో తహసీల్దార్ తుకారాం, అధికారులు లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గాడ్గె సుభాష్, పంచాయతీ కార్యదర్శి పురుషోత్తం, ఎస్ఐ లింబాజీ, ఏఈవో సంధ్యారాణి, ముక్రా(బీ) హెచ్ఎం జగన్‌మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

సిరికొండలో..

సిరికొండ మండలంలోని మల్లాపూర్, సోంపెల్లిలో ఎంపీడీవో సురేశ్, తహసీల్దార్ విజయ్‌కుమార్ దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో సోంపెల్లి సర్పంచ్ శాంతబాయి, మల్లాపూర్ సర్పంచ్ బాపురావ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రజలకు అసౌకర్యాలు లేకుండా చూడాలి

ఉట్నూర్ రూరల్, డిసెంబర్ 29 : ప్రజాపాలన కార్యక్రమంలో ప్రజల నుంచి అధికారులు దరఖాస్తులు స్వీకరించడంలో ఇబ్బందులు కలగకుండా చూడాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జూపటేల్ సూచించారు. మండలంలోని బిర్సాయిపేట్ గ్రామంలో ప్రజాపాలన కార్యక్రమాన్ని పరిశీలించారు. అదేవిధంగా దొంగచింత, సాలేవాడ(బీ), చెరువుగూడ, హీరాపూర్(జే), కుమ్మరితండా గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, సర్పంచ్ అంకవ్వ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తాంసి(తలమడుగు), డిసెంబర్ 29: తలమడుగు మండలంలోని పల్సీ(బీ), పల్సీ తండా, నందిగాం, పల్లి(కే) గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజమోహన్, ఎంపీడీవో రమాకాంత్, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్, డిసెంబర్ 29: మండలంలోని దిగ్నూర్, అందుగూడ, గోకొండ గ్రామాల్లో కొనసాగుతున్న ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని ఎంపీడీవో రాధ పరిశీలించారు. ఆమె వెంట తహసీల్దార్ శంకర్, ఎంపీవో మహేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

ఉట్నూర్‌రూరల్: మాట్లాడుతున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జూపటేల్

నార్నూర్ : అర్జునిలో మాట్లాడుతున్న డీఎల్‌పీవో భిక్షపతిగౌడ్

తాంసి: సావర్గాంలో మాట్లాడుతున్న డీఆర్డీవో కిషన్

వైద్య సేవలు భేష్

నార్నూర్, డిసెంబర్ 29 : మారుమూల గిరిజన ప్రజలకు వైద్య సిబ్బంది అందించే వైద్య సేవలు సంతృప్తిగా ఉన్నాయని ఎన్‌క్యూస్ బృందం ప్రతినిధులు డాక్టర్ రాజ్‌కుమార్, డాక్టర్ ప్రమోద్ అన్నారు. శుక్రవారం గాదిగూడ మండలంలోని ఝరి గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. పలు రికార్డులు పరిశీలించారు. ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్య సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో వైద్య సిబ్బంది వ్యాధుల నివారణ, ప్రసవాలు జరిగేలా చూడడం, గర్భిణులకు అందిస్తున్న వైద్య సేవలు బాగు ఉన్నాయన్నారు. వైద్య సిబ్బందిని అభినందించారు. వారి వెంట డీప్యూటీ డీఎంహెచ్‌వో విజయ్‌కుమార్,డీఎంవో శ్రీధర్, వైద్యాధికారి సంజీవ్‌కుమార్, ఎంవో రవీందర్, హెచ్ఈ సంజయ్, సిబ్బంది ఉన్నారు.

ఝరిలోని దవాఖానను సందర్శిస్తున్న ఎన్‌క్యూస్ బృందం ప్రతినిధులు

ప్రజాపాలనలో రైతుబంధు మాట ..

భీంపూర్,డిసెంబర్ 29 : భీంపూర్ మండలం అంతర్గాం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ప్రజాపాలన సభలో జడ్పీటీసీ కుమ్ర సుధాకర్ రైతుబంధు ఎప్పుడు వస్తుందని ఏఈవోను అడిగారు. త్వరలో వచ్చే అవకాశం ఉందని ఏఈవో చెప్పారు. ఒక ఎకరానికి కూడా రావడం లేదని జడ్పీటీసీ అనగా తమకు ఎవ్వరికి రాలేదని స్థానికులు చెప్పారు. ఇదంతా వింటున్న అక్కడి కాంగ్రెస్ నాయకులు ప్రజాపాలన సభను రాజకీయం చేయవద్దని కోరారు. ఇటు ఈ చర్చ కొనసాగుతుండగా అధికారులు దరఖాస్తులు తీసుకుంటూ వారి పని చేసుకుపోయారు.

విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలి

ఆదిలాబాద్ రూరల్, డిసెంబర్ 29: ఆదిలాబాద్‌లోని హిందీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీత శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులతో ఆమె మాట్లాడారు. వార్షిక పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలన్నారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని సిబ్బందికి సూచించారు. వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని పేర్కొన్నారు. ఆమె వెంట ఉపాధ్యాయులు ఉన్నారు.

సాహితీ సేవకు ఉపాధ్యాయురాలికి అవార్డు

ఉపాధ్యాయురాలికి అవార్డు అందజేస్తున్న నిర్వాహకులు

భీంపూర్, డిసెంబర్ 29 : గుడిహత్నూర్ మండలం మన్నూర్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు, ప్రముఖ కవయిత్రి బట్టువార్ అరుణను సాహితీ సేవకుగాను సావిత్రీబాయి పూలే అవార్డు వరించింది. హైదరాబాద్‌లోని త్యాగరాయగానసభ హాల్‌లో శుక్రవారం ఇందిరా ఆర్ట్ క్రియేషన్స్ సంగీత సాహిత్య సామాజిక సంస్థ వారు ఈ అవార్డును అందజేశారు. ఆమె పాఠశాల విద్యార్థులతో మంచి కవితలు, కథలు రాయిస్తూ సొంతంగా రూ. 50 వేలతో పుస్తకం ప్రచురింపజేశారు. ఈ సాహితీ సేవ గుర్తించిన సంస్థ ఉపాధ్యాయురాలిని సన్మానించి ప్రఖ్యాత అవార్డుతో సత్కరించింది. అరుణకు అవార్డు రావడంపై కవులు, రచయితలు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్షుడికి సన్మానం

ఉట్నూర్ రూరల్, డిసెంబర్ 29: ఇటీవల జిల్లా కేంద్రంలో అటవీ శాఖ జిల్లా జూనియర్ ఫారెస్ట్ అధికారుల సంఘం ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో బేల మండలం ఫారెస్ట్ సెక్షన్ అధికారిగా పని చేస్తున్న అజ్మీరా నరేశ్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం, బంజారా హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేశ్ నాయక్, బంజారా సేవా సమితి జిల్లా గౌరవాధ్యక్షుడు భూక్యా కిషన్ నాయక్, మున్యాల సర్పంచ్ సురేశ్ నాయక్, జేఏసీ జిల్లా నాయకుడు రాథోడ్ నారాయణ్ నాయక్, లంబాడీ జేఏసీ ప్రధాన కార్యదర్శి బానోత్ రామారావ్ నాయక్ పాల్గొన్నారు.

నరేశ్‌ను సన్మానిస్తున్న నాయకులు

మొబైల్ వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలి

చిత్తగూడలో వైద్యశిబిరాన్ని సందర్శిస్తున్న అదనపు డీఎంహెచ్‌వో కుమ్ర బాలు

నార్నూర్, డిసెంబర్ 29 : గాదిగూడ మండలంలోని గిరిజన పల్లెల్లో అందిస్తున్న మొబైల్ వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలని అదనపు డీఎంహెచ్‌వో కుమ్ర బాలు అన్నారు. శుక్రవారం గాదిగూడ మండలం చిత్తగూడలో మొబైల్ వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామం చుట్టూపక్కల ప్రజలు చికిత్స నిమిత్తం రావడంతో వారికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఈ వైద్య శిబిరాన్ని అడిషనల్ డీఎంహెచ్‌వో సందర్శించారు. వైద్య సేవలను పరిశీలిస్తూ వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో గాదిగూడ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్, స్వరూప్, హెచ్ఈవో తుల సీదాశ్, పవార్ రవీందర్, సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు, స్వెటర్లు పంపిణీ

బోథ్, డిసెంబర్ 29 : సోనాలలో పూలే వెల్ఫేర్ సొసైటీ చైర్మన్ గాజుల పోతన్న ఆధ్వర్యంలో శుక్రవారం వృద్ధులకు దుప్పట్లు, స్వెటర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ ప్రధాన కార్యదర్శి బత్తుల రమేశ్, ఉపాధ్యక్షుడు తుమ్మ శ్రీధర్, కార్యదర్శి అమృత్‌రావ్ పాటిల్, కొల్లూరి అనిల్, గౌరవాధ్యక్షుడు ఆమ్రె సాయికిట్టు, సలహాదారులు బాశెట్టి రమేశ్, కసిరే పోతన్న, విజయ్ భాస్కర్, అనిల్, సభ్యులు సోన్న హరీశ్, మచ్చేందర్, జక్కుల రవి, శ్రీను, కడారి రమణ పాల్గొన్నారు.


దుప్పట్లు